నేడు TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY



రాజస్థాన్ రాయల్స్‌దే విజయం 07

సోమవారం | 31.03.2026 | సంపుటి : 3 | సంచిక :339 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

**సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్**

**బిల్లును వ్యతిరేకించిన బిజెపి**

**పౌర స్వేచ్ఛను హరించే బిల్లు : కెటిఆర్**

హైదరాబాద్, మార్చి 30 : తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన

# కేసీఆర్ లేకపోతే నేను లేను

**ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ**

**ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన**

**నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు**

**సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది**

**వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం**

**త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ**


**మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి**



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కారణంగానే తన గొప్పతనం ఏమిటో తెలంగాణ సమాజానికి తెలిసిందని అంటున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. అసలు కేసీఆర్ లేకపోతే తాను లేనంటూ చెప్పుకొచ్చారు రేవంత్. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ' కేసీఆర్ వల్లే నాకు ఈ గుర్తింపు వచ్చింది. కేసీఆర్ లేకపోతే నేను లేను. రావణుడి చెడువల్లే రాముడి గొప్పతనం తెలిసింది. కేసీఆర్ రెస్ట్ తీసుకుంటున్నారని అంతా అనుకుంటున్నారు. కేసీఆర్‌ను గృహనిర్బం ధం చేశారని నాకు అనుమానంగా ఉంది. కాలనాగు కంటే హరీష్‌రావు ప్రమాదం' అని పేర్కొన్నారు.

హైదరాబాద్, మార్చి 30 : ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ

-మిగతా 2 లో..



07

**ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం**

త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి

మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్



07

**పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు**

నో చెప్పిన ఇరాన్



02

**లాకర్ వస్తువులకు బీమా సౌకర్యం కుదరదు**

అందులో ఏం దాచారో బ్యాంకులు చూడవు

లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

# చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

**ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం దాదాపు అంతమైంది**

**ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు**

**సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు**

**నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన**



న్యూఢిల్లీ, మార్చి 30 : మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. నక్సలిజం నిర్మూలన చర్యలపై సోమవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఆయుధాలు

-మిగతా 2 లో..



# చైనా సీసీ టీవీ కెమెరాల బ్యాన్

**బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం**

**కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం**

న్యూఢిల్లీ,మార్చి30 : చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు

-మిగతా 2 లో..



**ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు**

# సామాన్యుల బలి

**కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్**

**వట్టినాగులపల్లిలో బాధితులకు కేటీఆర్ పరామర్శ**

**అండగా ఉంటామని హామీ**

హైదరాబాద్, మార్చి 30 : సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹58

# పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుని నిషేధించాలి

**తీర్మానం ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ**

హైదరాబాద్, మార్చి 30 : తెలంగాణలో పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుని నిషేధించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రవేశపెట్టారు. రైతులు వ్యవసాయానికి వాడుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ ప్రమాదకరంగా మారిందని.. అందుకే తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సభ్యులకు

-మిగతా 2 లో..



# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

**వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి**

**గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి**

**సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ**

హైదరాబాద్, మార్చి 30 : జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల

-మిగతా 2 లో..



# ఉద్యకారులు లేకుంటే మనమంతా లేనట్లే

**ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి**

**ఉద్యకారులు లేకుంటే సిఎం, మంత్రులు కూడా ఉండేవారా?**

**మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్, మార్చి 30 : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజ్ఞప్తి చేశారు. సోమవారం శాసన మండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి

-మిగతా 2 లో..

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్ణం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, వైకల్యం, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలెక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.

## పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్, మార్చి 30 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుం దని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం',' సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరి చారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం దాదాపు అంతమైంది

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డీఏ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిత్ షా ధ్వజమెత్తారు.



## కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మా ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు. దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

(మొదటిపేజీ తరువాయి)



వచ్చి రెండేళ్లు దాటిపోయినా.. ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేదన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తుచేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు. ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యమకారులు తమను ప్రశ్నిస్తున్నారని శాసనమండలి వేదికగా ఎమ్మెల్సీ విజయశాంతి వివరించారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జూన్ 2వ తేదీ నాటికి వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని.. అది కూడా ఇంకా నెరవేరలేదని విజయశాంతి చెప్పారు. ఉద్యమకారులు లేకపోతే సీఎంలు, మంత్రులు ఉండేవారా? అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ నెరవేరిస్తే మరో చరిత్ర అవుతుందని.. పట్టించుకోకుంటే చారిత్రక తప్పిదం అవుతుందని విజయశాంతి పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి సూచించారు.

## కేసీఆర్ లేకపోతే నేను లేను

(మొదటిపేజీ తరువాయి)



మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్ కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నా రని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

## చైనా సీసీ టీవీ కెమెరాల బ్యాన్

(మొదటిపేజీ తరువాయి)

ఇలా ఉన్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను భారత్‌లో నిలిపివేయనున్నారు. ముఖ్యంగా 'స్టాండర్డ్ల÷జేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్' అనుమతి ఉన్న కెమెరాలను మాత్రమే ఇకపై దేశంలో విక్రయించాల్సి ఉంటుంది. నిఘా పరికరాలు అత్యంత సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తాయి. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్‌లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చైనా కెమెరాలను వాడటం వల్ల మన వ్యూహాత్మక సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరగనుంది. మొత్తానికి.. డేటా భద్రతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం టెక్నాలజీ , రక్షణ రంగాల్లో పెను మార్పులకు దారితీయనుంది.

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

## లాకర్ వస్తువులకు బీమా సౌకర్యం కుదరదు



**న్యూఢిల్లీ, మార్చి 30 :** బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ కుదరదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. లాకర్లలో దాచిన వస్తువులను బ్యాంకు అధికారులు చూడరని, వాటిని రికార్డు చేయరని స్పష్టం చేశారు. కాబట్టి విలువ ఆధారంగా బీమా కవరేజీ అందించడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఈ అంశాన్ని (ఃజీనీ ÷నీఃజీఃసబ) లేవనెత్తగా ఆర్థిక మంత్రి దీనిపై స్పందించారు. 'లాకర్లలోని వస్తువులను బ్యాంకు సిబ్బంది తనిఖీ చేయలేరు. అలా చేయడం బ్యాంకు రూల్స్‌కి విరుద్ధం. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయి. లాకర్ వార్షిక అ÷-దదెకు 100 రెట్లు పరిహారం చెల్లిస్తున్నాయి' అని ఆమె గుర్తుచేశారు. లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీలు చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం అందించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని మంత్రి తెలిపారు.

## పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుని నిషేధించాలి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి వివరించారు. ఇది ప్రాణాంతక రసాయనమని.. దీన్ని అనేక దేశాల్లో నిషేధించారని తెలిపారు. పారాక్వాట్ డైక్లోరైడ్ వాడడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వాడి అనేక మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ లక్ష్యాలకు ఇది అడ్డుగా మారిందని.. దీని తయారీ, వాడకం, రవాణా, దిగుమతి ఇలా అన్ని విధాలుగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గడ్డి మందుని నిషేధించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేశారు. ఇటీవలే నడుగు రాహుల్ రామకృష్ణ సోదరుడు దీనికి బలయ్యారు.

# పొంగులేటిని బర్తరఫ్ చేయండి

- అక్రమాలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు బిఆర్ఎస్ విజ్ఞప్తి



**హైదరాబాద్, మార్చి 30 :** ప్రతిపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. లోక్ భవన్‌కు వెళ్లిన బీఆర్ఎస్ బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆదివారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మంత్రి పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్ ద్వారా అక్రమ మైనింగ్?కు పాల్పడుతూ ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్‌పై వ్యవహారాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో గత పదేండ్ల కాలంలో జరిగిన ప్రతి అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో సీబీ సీ-ఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.



## క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

**జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్**

**హైదరాబాద్, మార్చి 30 :** క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఆయన లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంలోని సౌకర్యాలను ఎంపీ రఘునందన్ రావు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రిలో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఇందులో ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే.. తగిన చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చున్నారు.

## 30వేలు లంచం డిమాండ్

**ఏసీబీకి చిక్కిన ఎస్ఐ**

**నాగర్‌కర్నూల్, మార్చి 30 :** తిమ్మాజిపేట మండల ఎస్సై ఏసీబీకి పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి ఒక వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం ఎస్సై డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఇసుక సరఫరా చేస్తున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని ఈనెల 5న ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60 వేలు ఫైన్ వేశారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్సైకి అందజేశాడు. అయితే ఎస్సై రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను విడుదల చేస్తామని డిమాండ్ చేశారు. మైనింగ్ ఫైన్ కట్టడంతో పాటు, మళ్లీ రూ. 30 వేలు కట్టవలసి రావడంతో వాయిస్ రికార్డింగ్‌లు, రూ. 20వేలు చెల్లించిన అంశాలతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అన్ని ఆధారాలతో ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

# గిగ్ వర్కర్ల రక్షణకు బిల్లు

**ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ**



**హైదరాబాద్, మార్చి 30 :** గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీలో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు మీటింగులు పెట్టామని.. చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ.లక్షా50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు 'సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది. ఇంతకాలం యాప్ కంపెనీలు ఏ ప్రాతిపదికన ఆర్డర్లు ఇస్తున్నాయి, పేమెంట్లు ఎలా లెక్కిస్తున్నాయి అనే దానిపై స్పష్టత ఉండేది కాదు. ఇకపై యాప్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లు రేట్లు తగ్గించడం, కార్మికులను ఇబ్బంది పెట్టడం కుదరదు. కార్మికులకు ఇచ్చే పేమెంట్లలో పారదర్శకత ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తారు.

## సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

**అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్ : ఉత్తమ్**



**హైదరాబాద్, మార్చి 30 :** సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్.. సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చుచేశామని చెప్పారు. ఇపుడు పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు. ఎంత ఖర్చైనా సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల ఖాతాలో ఇప్పటి వరకు రూ. 40 వేల కోట్లు వేశామన్నారు ఉత్తమ్. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకు వేస్తున్నామని తెలిపారు. అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు.



## న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

**అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్, మార్చి 30 :** న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకొస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభలో వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పట్టపగలే వారిని హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ప్రోద్భలంతోనే వారు హత్యకు గురైనట్లు ఆక్షేపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ బిల్లు తీసుకొస్తున్నట్లు చెప్పారు.

## అత్తాపూర్‌లో దారుణ ఘటన

**మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం**

**హైదరాబాద్, మార్చి 30 :** హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఒక దారుణ ఘటన ఇప్పుడు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోంది. కనీసం తనపై జరుగుతున్న దాడిని కూడా అర్థం చేసుకోలేని, తన గోడును ఎవరికీ చెప్పుకోలేని ఒక మతిస్థిమితం లేని యువతిపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్ నగర్‌లోని మతిస్థిమితం సరిగ్గా లేని ఒక యువతిపై ఈ అఘాయిత్యం జరిగింది. యువతి ఒంటరిగా ఉన్నది గమనించిన ఒక యువకుడు ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడ నుంచి పారిపోయాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు యువతి పరిస్థితి గమనించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు ప్రారంభించారు. నిదింతుడు అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల కోసం యువతిని ఆస్పత్రికి తరలించారు.

## మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ఆపండి

**కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం**

**హైదరాబాద్, మార్చి 30 :** అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని.. ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు. యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పుడు ఆగకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధాన్ని ఖండిస్తున్నామని.. ఆయా దేశాల మధ్య శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తీర్మానం చేస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

## కాళేశ్వరంతో లక్షకోట్లు ప్రజాధనం వృథా

**రాజ్యసభలో కేంద్ర మంత్రి పాటిల్ వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, మార్చి 30 :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సోమవారం రాజ్యసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ. లక్షల కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలంటూ రాజ్యసభలో కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ పైవిధంగా స్పందించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటుపై ఎన్డీఎస్ఏ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ నిధుల వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి సి.ఆర్.పాటిల్ ధ్వజమెత్తారు. రాష్ట్రం వద్ద రూ.873 కోట్లు ఉన్నా.. మూడేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.194 కోట్లేనని ఆయన గుర్తు చేశారు. మూడేళ్లుగా ఒక్క కొత్త స్కీమ్ ప్రతిపాదన కూడా తెలంగాణ ప్రభుత్వం నుంచి రాలేదని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ పెదవి విరిచారు. మరోవైపు తెలంగాణకు చెందిన రాజ్యసభ్య సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ చే విచారణ జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

## చిత్తశుద్ధి ఉంటే ఓవైసీపై చర్యలు తీసుకోండి

**బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్**

**న్యూఢిల్లీ, మార్చి 30 :** హేట్ స్పీచ్ బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే, మొదట తెలంగాణ ప్రభుత్వం.. అక్బరుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకువస్తే కాంగ్రెస్ సహా విపక్షాలు అడ్డుకున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, అన్ని విపక్షాలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఓబీసీల్లో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. ఓబీసీలు వెనకపడటానికి కారణవవుతున్నారని ఆరోపించారు. ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా అందరూ అడ్డుకున్నారని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చిందని... 4 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్లు ఎంపీ చెప్పారు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణ లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. పోటీపడి ఒక వర్గం ఓట్ల కోసం కక్కుర్తి పడుతున్నారని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల స్థానాల్లో ముస్లింలే పోటీ చేశారన్నారు.

## సైబర్ నేరగాడి ట్రాప్‌లో 6లక్షలు పోగొట్టుకున్న న్యాయమూర్తి

**పోలీసులు రంగంలోకి దిగడంతో మోసగాడి అరెస్ట్**

**ముంబై, మార్చి 30 :** ఒక హైకోర్టు న్యాయమూర్తి, సైబర్ నేరగాడి ట్రాప్‌లో పడ్డారు. ఆ జడ్జికి ఒక లింక్ పంపిన అతడు రూ.6 లక్షల మేర ఆయనను మోసగించాడు. న్యాయమూర్తి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చివరకు నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేశారు. ముంబైలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 28న బాంబే హైకోర్టు న్యాయమూర్తి తన క్రెడిట్ కార్డ్ పాయింట్లను రీడీమ్ చేసుకు నేందుకు ప్రయత్నించారు. ఆ బ్యాంకు కస్టమర్ కేర్ నంబర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించగా బిజీ వల్ల లైన్ కలవలేదు. ఆ న్యాయమూర్తి బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికారు. ఒక నకిలీ నంబర్‌కు ఆయన కాల్ చేశారు. జడ్జితో మాట్లాడిన సైబర్ మోసగాడు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించాడు. ఆయనకు ఒక లింక్‌ను పంపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. మరోవైపు ఆ న్యాయమూర్తి తన ఐఫోన్‌లో ఆ యాప్ డౌన్‌లోడ్ చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆ నకిలీ టెలీకాలర్ సూచించాడు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి తన సిమ్ కార్డును ఇంటి పనిమనిషి ఆండ్రాయిడ్ ఫోన్‌లో వేసి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆ యాప్‌లో తన క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేసిన వెంటనే ఆయన ఖాతా నుంచి రూ. 6.02 లక్షలు విత్ డ్రా అయ్యాయి. కాగా, మోసపోయినట్లు గ్రహించిన ఆ బాంబే హైకోర్టు జడ్జి వెంటనే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కఫ్ పరేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జార్ఖండ్‌లోని జామ్తారాలో నివసించే 25 ఏళ్ల మజార్ ఆలం ఇస్రాయిల్ మియాన్‌ను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. జార్ఖండ్‌లోని జామ్తారా సైబర్ సెల్, కర్మతాండ్ పోలీసుల సహాయంతో పది రోజుల్లోనే నిందితుడ్ని అరెస్ట్ చేశారు. 10 రాష్ట్రాల్లో జరిగిన 36 సైబర్ మోసాల కేసులతో నిందితుడికి సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు.



## అమెరికాకు స్పెయిన్ షాక్

**గగనతలంలో విమానాలకు అనుమతి నిరాకరణ**

**న్యూఢిల్లీ, మార్చి 30 :** అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలు పంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు. ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. 'ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏక పక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది' అని రక్షణ, ఆర్థిక మంత్రులు స్థానిక మీడియాలో వెల్లడించారు.

## నల్లగొండలో ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

**నల్లగొండ, మార్చి 30 :** టీజీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ డిపో జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యుత్ బస్సుల విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గో బ్యాక్ గోబ్యాక్ ఈవీ బస్సులు గో బ్యాక్.. ఆర్టీసీ స్థలాల్లో– ఆర్టీసీ బస్సులే ఉండాలి.. ఆర్టీసీ బస్సులే ఉండాలి– ఆర్టీసీ సిబ్బందే నడపాలి.. ఆర్టీసీ స్థలాల నుండి– ప్రైవేట్ ఈవీ బస్సులు వెళ్లగొట్టాలే అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వమే ఈవీ బస్సులని కొనుగోలు చేసి ఆర్టీసీలకు ఇవ్వాలని, ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేట్ ఈవీ బస్సులను తీసుకుని, పూర్తిగా ప్రైవేట్ వారికి అప్పగించి, కొత్త నియామకాలు చేపట్టకుండా పూర్తిగా సంస్థను నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను, మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల పట్ల రాష్ట్ర జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, ఇక ముందు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేసి అన్నింటిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు బి.నరేందర్, బాసాని వెంకటయ్య, జిల్లా జేఏసీ నాయకులు ఎన్ఆర్సీ రాజు, టీజే రావు, డిపో జేఏసీ నాయకులు ఏఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య!



**ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావం-ˇణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం.**

మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు.

నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదు-రయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయింపులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్దరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెటెక్కుతారు. నదీ జలాలలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుతుంది.

# అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

**హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే**
**శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి**

**హైదరాబాద్, మార్చి 30 :** రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మె-ంత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే



బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.

# నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

**సింగరేణికి సంబంధించి పలు సూచనలు చేసిన కాగ్**

**హైదరాబాద్, మార్చి 30 :** తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే



లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.




## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

**బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా**

**పాట్నా, మార్చి 30 :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు. ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**నారాయణపేట, మార్చి 30 :** నారాయణపేట జిల్లా కృష్ణన మండలం గుడేబడ్లూరులో విషాదం నెలకొంది. అప్పుల బాధతో కృష్ణా నదిలో దూకి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గుడేబడ్లూరు టై రోడ్డు చెక్‌పోస్టు వద్ద నివాసం ఉండే నాగరాజు (55) కృష్ణా పరివాహక ప్రాంతంలో భూమి కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత రెండేళ్లుగా ఆశించినంతగా వరి పంట దిగుబడి రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో నిరాశకు లోనైన నాగరాజు.. ఈ సీజన్‌లో పంట వేయలేదు. సాగు కోసం చేసిన అప్పుల తీర్చేందుకు, పొట్ట కూటి కోసం హైదరాబాద్ వచ్చాడు. హైదరాబాద్‌లో చిన్నా చితకా పనిచేస్తున్న నాగరాజు.. రెండు రోజుల క్రితం భార్యాపిల్లలను చూసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కృష్ణ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పుల బాధ భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజు భార్య పోలీసులకు తెలిపింది. కౌలు రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని స్థానికులు డిమాండ్ చేశారు.

## నరసరావుపేట కుటుంబ ఆత్మహత్యాయత్నం కేసు

- **చికిత్స పొందుతూ డాక్టర్ గోపి మృతి**
- **ఇప్పటికే మృతి చెందిన భార్య, కూతురు**

**పల్నాడు,మార్చి30 :** నరసరావుపేటలో డాక్టర్ కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనలో మరొకరు మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్యుడు గోపి సోమవారం చనిపోయారు. నరసరావుపేటలో డాక్టర్ కుటుంబం ఆత్మహత్య తీవ్ర విషాదాన్ని నింపింది. నాదెండ్ల మండలానికి చెందిన డాక్టర్ కుంభ గోపి కుటుంబం ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో మూడేళ్ల చిన్నారి మౌనిక, భార్య శంకర కుమారి మృతి చెందగా.. డాక్టర్ గోపి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం కన్నుమూశారు. గోపి కుటుంబం భోపాల్‌లో నివాసం ఉంటోంది. భోపాల్ ఎయిమ్స్‌లో గోపి డాక్టర్‌గా, అతడి భార్య శంకర కుమారి నర్స్‌గా పనిచేస్తున్నారు. వారికి మూడేళ్ల కుమార్తె మౌనిక ఉంది. చిన్నారి మౌనికకు పుట్టినప్పటి నుంచి డౌన్ సిండ్రోమ్ అనే అనారోగ్య సమస్య ఉండటంతో తండ్రి గోపి తీవ్ర మనస్తాపం చెందారు. ఈ కారణంగా గోపి కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్రం చేసినట్లు తెలుస్తోంది. గోపి కుటుంబం శనివారం రాత్రి భోపాల్ నుంచి నరసరావుపేటకు వచ్చింది. ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని చిన్నారితో సహా భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. మత్తు ఇంజెక్షన్ తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

**8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు : మంత్రి నాదెండ్ల**

**నెల్లూరు, మార్చి 30 :** చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. సోమవారం ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 60 వేల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. రైతులందరూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. రైతులకు తేమ సమస్య ఉందని, 22 శాతం తేమ ఉన్నా ధాన్యం తీసుకునేలా ఆదేశాలు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక డ్రోన్లు ఇచ్చిన తరహాలో డ్రయర్లు కూడా రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ వెంటనే బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని, అలా చేయని పక్షంలో వాటిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరించారు. మిల్లర్ల అవకతవకలు, నిర్లక్ష్యం సహించేది లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన

- **మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్**
- **ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్**

**హైదరాబాద్, మార్చి 30 :** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఒక్క రోజు సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరిస్తున్నట్లుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది. అసెంబ్లీ సెషన్ ముగిసేవరకూ సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరించింది. దీంతో పొంగులేటి కంపెనీ అవినీతిపై మండలిలో బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. పొంగులేటిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అవినీతిపై సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా మండలి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇలా మండలి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, సస్పెన్షన్‌కు నిరసగా బీఆర్ఎస్ మండలి సభ్యులు చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో మండలి సభ్యులను మార్షల్స్ బలవంతంగా లాక్కెళ్లారు. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాని.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్



చేయాలని నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభలో సీఎం రేవంత్ స్పష్టం చేశారని చెప్పారు. సభ సజావుగా సాగేందుకు బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని కోరారు. మరోవైపు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని పదే పదే కోరారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన కొనసాగించడంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఒకరోజుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఇప్పటికే అసెంబ్లీలో కూడా బిఆర్ఎస్ సభ్యులను ఆదివారం సస్పెండ్ చేశారు. సోమవరంతో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి.



## ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

**కీసర, నేడు న్యూస్ :** మల్కాజ్ గిరి జిల్లా విశ్వ హిందూ పరిషత్ ( వి హెచ్ పి) ఆధ్వర్యంలో, శనివారం ఉదయం కీసర గుట్ట పుణ్యక్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో వి హెచ్ పి ఉగాది క్యాలెండర్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రజినీకాంత్ మాట్లాడుతూ, "హిందూ సాంప్రదాయం ప్రకారం ఉగాది మనకు తొలి మాసం. అందుకే ఉగాది పండుగ పురస్కరించుకుని ఈ తెలుగు క్యాలెండర్‌ను విడుదల చేయడం జరిగింది. మన ఆచార, సాంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి హిందువు యొక్క ముఖ్య కర్తవ్యం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీ రామనర్సింహులు, ఉపాధ్యక్షురాలు శ్రీమతి కమల్ పంత్, జిల్లా కార్యదర్శి రజినీకాంత్, సహ కార్యదర్శి గోపాల్ చారి, జిల్లా బజరంగ్ దళ్ సహ సంయోజక్ రేవంత్, జిల్లా దుర్గా వాహిని సంయోజిక కుమారి జీవిక, విమర్శ ప్రముఖ్ రాజి రెడ్డి, కీసర ప్రఖండ కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి, సత్సంగ ప్రముఖ్ గగన్ తదితరులు పాల్గొన్నారు.




## గుంతలతో గజిబిజి రహదారులు

### 99 రోజుల ప్రణాళికలో ఉసిరికాయలపల్లి వైఫల్యం

**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో రహదారుల దుస్థితి రోజురోజుకు మరింత ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా బండారి కోటమ్మ ఇంటి ముందు ఏర్పడిన భారీ గుంతలు గ్రామస్థుల ప్రాణాలకు ముప్పుగా మారి మృత్యుపాశాలలా కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. గ్రామంలోని 3వ వార్డు సభ్యురాలు బర్మవత్ భర్వతి, 9వ వార్డు సభ్యుడు ధారావత్ రమేష్ నాయక్‌లు పలుమార్లు సర్పంచ్, అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని నిర్లక్ష్య ధోరణిపై వారు తీవ్రంగా మండిపడ్డారు. ఈ గుంతల కారణంగా ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇటీవల ఓ కారు గుంతలో ఇరుక్కుపోవడం, ఒక లేగదూడ బురదలో చిక్కుకోవడం వంటి ఘటనలు గ్రామస్థుల్లో భయాందోళనకు కారణమయ్యాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించడం మరింత ప్రమాదకరంగా మారిందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చి రహదారిని సరిచేయాలని గ్రామస్థులు, వార్డు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళిక అమలులో ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీ పూర్తిగా విఫలమైందని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనకు దిగుతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

### నేడు ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో

## డయల్ యువర్ డీఎం



**బోడుప్పల్, నేడు న్యూస్:** ఆర్టీసీ చెంగిచెర్ల డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి గాను నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో సోమవారం ఆమే మాట్లాడుతు డిపో పరిధిలోని పలు రూట్లలో ప్రయా ణికులు ఎదుర్కొం టున్న సమస్యలతో పాటు ప్రయాణి కుల సలహాలు, సూచ నలు తెలుసు కునేందుకు గాను డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు మంగళవారం సాయంత్రం 3 గంటల నుండి 4 గంటల మధ్య డిపో మేనేజర్ సెల్ 78930 88433 నెంబర్ ను సంప్రదించాలని ఆమె కోరారు.



## ఏఐ యుగంలో కూడా అంటరానితనమా?

### యాద్రాస్పల్లి గ్రామంలో బాధిత కుటుంబాలతో సమావేశం అయిన కీసర మండల నాయకులు

**కీసర నేడు న్యూస్:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లి మున్సిపాలిటీ యాద్రాసపల్లి గ్రామంలో బాధిత దళిత కుటుంబాల ముఖ్యసమావేశంలో కీసర మండల నేతలు పాల్గొని అద్రాస్పల్లిలోని రామాలయంలో సీతా రామ కల్యాణ వేడుకల్లో పాల్గొనేందుకు అదే గ్రామానికి చెందిన పలువురు దళితులు వెళ్లారు. ఆలయంవద్ద యాంజాల నీలమ్మ, యాంజాల యాదమ్మ, చిలుక పుష్పమ్మలు.. ఆలయానికి చెప్పులు వేసుకొని ఎందుకు వస్తున్నారు? మా పక్క మీరు కూర్చోవద్దు, కొబ్బరికాయలు కొట్టొద్దంటూ దూషించారు. విషయం తెలుసుకున్న షామీర్పేట పోలీసులు విచారిస్తున్నారు. వారిపై తక్షణమే స్పందించిన శామీర్పేట్ పోలిస్టేషన్ సీఐ, ఎస్ ఐలకు కృతజ్ఞతలు తెలియజేస్తూనే వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోని భవిషత్తులో అంటరానితనం రూపుమాపేలా పౌరహక్కుల సదస్సు నిర్వహించి అవమానం జరిగిన చోటే తేలేత్తుకునేలా ఉండేలా తోడ్పాటు అందించాలని కీసర మండల నేతలు కోరడం జరిగింది. దళితులలో ఆత్మన్యునత భావం తీసివేసి స్వేచ్ఛ ప్రపంచంలో ఉన్నంతంగా బ్రతకాలని అప్పుడే అంటరానితనం రూపుమాపుతుందని పలువురు పెద్దలు సూచించారు. సరిగ్గా 1930లో డా బి ఆర్ అంబేద్కర్ నెత్రుత్వంలో గుడిలోకి ప్రవేశించిన పోరాటాన్ని గుర్తు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామరం సుజాత, ఎమ్మార్పియస్ కీసరమండల ఇంచార్జ్ బుడిగే జగన్, కీసర మండల ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు బక్కని కుమార్, కీసర మండల ఆదిజంభవ అరుంధతి సేవాసమితి సభ్యులు తుడుం శ్రీనివాస్, మాదిగ జాగృతి నాయకులు చొక్కాపురం శ్రీరాములు, చినింగని మల్లేష్, పోచయ్య, చొక్కాపురం ప్రవీణ్, చిర్యాల గ్రామ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు బండారి నరసింహ రావు, ఉపాధ్యక్షులు బురిగల్ల మధు పాల్గొన్నారు ధైర్యం చెప్పడం జరిగింది

# నిఘా నీడలో నిశ్శబ్దం

- విజిలెన్స్ వైఫల్యం.. అవినీతికి వరం !
- మౌనమే 'ముడుపుల'కు మూలమా ?
- ఏసీబీ వర్సెస్ విజిలెన్స్ ఎవరు బాధ్యులు ?
- వ్యవస్థ ప్రక్షాళన ఎప్పుడు ?



**మేడ్చల్, నేడు న్యూస్ :** ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి అనేది ఒక అంటువ్యాధిలా విస్తరిస్తోంది. సామాన్యుడి చెమట చుక్కల నుంచి పుట్టిన పన్నుల ద్వారా జీతాలు పొందుతున్న కొందరు అధికారులు, ఆ జీతం చాలదన్నట్టు 'లంచం' అనే అదనపు ఆదాయానికి అలవాటు పడిపోతున్నారు. వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన విజిలెన్స్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, అవినీతి తిమింగలాలు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి.

### మౌనమే 'ముడుపుల'కు మూలమా ? :

ఏ ప్రభుత్వ శాఖలోనైనా అక్రమాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాల్సిన బాధ్యత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే విజిలెన్స్ విభాగం మౌనంపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంతో పోలిస్తే అకస్మిక తనిఖీలు మందగించాలని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో లంచావతారులు బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### ఏసీబీ వర్సెస్ విజిలెన్స్ ఎవరు బాధ్యులు? :

ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ దాడులు ఒక చేదు నిజాన్ని బయటపెట్టాయి. కింది స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి అధికారుల వరకు ప్రతి పనికీ రేట్లు ఫిక్స్ చేస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఏసీబీ దాడుల్లో ఎక్కువగా చిరుద్యోగులే దొరుకుతుండటం గమనార్హం. మరి ఈ వ్యవస్థను వెనుక నుండి నడిపిస్తున్న 'పెద్ద తిమింగలాల' సంగతేంటి ? వారి వరకు ఏసీబీ పంజా చేరడం లేదా? అన్నది మిగిలి ఉన్న పెద్ద ప్రశ్న. నిఘా సంస్థలు నిష్క్రియగా ఉండటంతో, లంచావతారులు పూటకొకరు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని, పనులు పెండింగ్‌లో పెట్టి, మానసిక ఒత్తిడికి గురిచేసి డబ్బులు గుంజుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులను కూడా 'లంచం' ఇస్తేనే పనులు జరుగుతున్నాయని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది వ్యవస్థాగత వైఫల్యానికి నిదర్శనం.

### వ్యవస్థ ప్రక్షాళన ఎప్పుడు? :

అప్పుడప్పుడు జరిగే ఏసీబీ దాడులతో అవినీతి అంతం కాదు. విజిలెన్స్ విభాగం తన నిద్రను వీడాలి. ప్రతి శాఖపై నిరంతర నిఘా ఉండాలి. కేవలం కింది స్థాయి సిబ్బందిని కాకుండా, అవినీతికి మూల కారణమైన పైస్థాయి అధికారుల అక్రమ ఆస్తులపై దృష్టి సారించాలి. లంచం అడిగే అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకునేలా ఒక బలమైన వ్యవస్థను రూపొందించాలి. "విజిలెన్స్.. సైలెన్స్" గా ఉంటే అది సమాజానికి ప్రమాదకరం. నిఘా వ్యవస్థలు చురుగ్గా పనిచేయనంత కాలం, సామాన్యుడికి న్యాయం జరగదు. అవినీతి అధికారుల గుండెల్లో వణుకు పుట్టించాల్సిన సంస్థలే మౌనం పాటిస్తే, అది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వ్యవస్థలో పేరుకుపోయిన ఈ 'అవినీతి మురికిని' కడిగేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### బాలలందరికీ హెచ్.పీ.వీ

## వాక్సినేషన్‌ను అందించాలి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్, నేడు బ్యూరో:** జిల్లాలోని రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్, హాస్టల్స్, స్కూల్స్ లోని 14 నుంచి 15 సంవత్సరాల వయసు గల బాలికలకు అందరికి హెచ్.పీ.వీ వ్యాక్సినేషన్ ను అందించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం కీసర మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ క్యాన్సర్ నివారణ ( బాలికలకు భవిష్యత్ లో రాకుండా ఇచ్చే ) హెచ్.పీ.వీ వ్యాక్సినేషన్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యాక్సిన్ ఎంత డోసు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ తీసుకున్న బాలికలకు కలెక్టర్ హెచ్.పి.వి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ అందజేశారు. జిల్లాలోని బీ.సి, ఎస్సీ, మైనారిటి రెసిడెన్షియల్, హాస్టల్స్, స్కూల్స్ లలోని బాలికలకు కూడా హెచ్.పి.వి వ్యాక్సినేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సూచించారు. దీనికి సంబంధించి డీ.ఎం అండ్ హెచ్.వో సంబంధిత శాఖల సమన్వయంతో పిల్లలందరిని మొబిలైజ్ చేసుకొని వ్యాక్సిన్ అందించేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా 24/7 పీ.హెచ్.సీ లన్నింటిలో కూడా ఈ వ్యాక్సినేషన్ అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇంకెక్కడైనా వేరే చోట్ల ఉంటూ పని చేస్తున్న వారిని అలాగే, ఇంకేదైనా ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తించి వారందరినీ కూడా మొబిలైజ్ చేసి వ్యాక్సినేషన్ అందించే చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా గ్రామాలలో కూడా తల్లిదండ్రులకు, బాలికలకు స్వచ్ఛందంగా వచ్చి వ్యాక్సిన్ తీసుకునేలా ఈ వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పీ.హెచ్.సి సెంటర్‌ను పరిశీలించారు. మరమ్మత్తులకు మంజూరు చేసిన పనులు ఏమేమి చూపిస్తున్నది మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. అదనంగా నిధులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మందుల గదిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ పరిశీలించి మందులు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర్ ఆర్డిఓ రాజేష్, జిల్లా డీ.ఎం అండ్ హెచ్.ఓ ఉమాగౌరి, డిప్యూటి డీ.ఎం అండ్ హెచ్.ఓ డాక్టర్: సత్యవతి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్: కౌశిక్,పీ.హెచ్.సీ మెడికల్ ఆఫీసర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



### ప్రజావాణి దరఖాస్తులను

## వెంటనే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అమ్మద్

**మేడ్చల్, నేడు బ్యూరో:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను జాప్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ – మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి 143 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ కోరారు. తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే స్పెషల్ డిప్యూటి కలెక్టర్ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కీసరలో నీటి కష్టాలు:

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన!
- ప్రజావాణిలో అధికారులను నిలదీసిన బీజేపీ నాయకులు




**కీసర నేడు న్యూస్:** మండలంలోని చీర్యాల జిన్నారం కాలనీలో గత ఏడు నెలలుగా తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కీసర సర్కిల్ ఆఫీస్ 'ప్రజావాణి' కార్యక్రమంలో మహిళలు ఖాళీ బిందెలతో భారీ ధర్నా నిర్వహించారు. గత ఏడు నెలలుగా జిహెచ్ఎంసి నుంచి వచ్చే మంచినీటి ట్యాంకర్లను నిలిపివేయడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి రోజుకు కనీసం రెండు ట్యాంకర్ల చొప్పున మంచినీటిని సరఫరా చేసేలా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కీసర మండల భాజపా అధ్యక్షులు కోల బాలరాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. త్రాగునీరు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల భూగర్భజలంలోని నీరు కలుషితమై బోరు నీరు తాగి రోగాల పాలవుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి వాటర్ ట్యాంకర్ తో నీటి సప్లై చేయాలని అధికారులను కోరారు. ఈ ధర్నాపై డిప్యూటీ కమిషనర్ కమిషనర్ వసంత, జిహెచ్ఎంసి వాటర్ డిపార్ట్మెంట్ ఇన్చార్జ్ వెంకటేష్ సానుకూలంగా స్పందించారు. తక్షణమే ట్యాంకర్లు పంపిస్తామని వారు హామీ ఇవ్వడంతో మహిళలు తమ నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కోలా బాలరాజు యాదవ్ పాల్గొని కాలనీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో చర్చించారు.



## డ్రైవర్లకు కంటి పరీక్షా శిబిరం

**ఉప్పల్/ కుషాయిగూడ, నేడు న్యూస్:** "అరైవ్ అలైవ్" ప్రచారం--2026 (దశ--3)లో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లకు ప్రత్యేక కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కుషాయిగూడ డిఐజి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో పరిపాలన ఎస్ఐ ఎన్. సుధాకర్ రెడ్డి తో పాటు ఎస్ఐలు ఎన్. వెంకన్న, ఎం. విజయ్ పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో, ప్రజల ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

# గిరిజన రైతులకు మోసం

- 45 ఎకరాల మొక్కజొన్న పంటపై అనిశ్చితి!
- ఆర్గనైజర్ల మోసంతో రోడ్డున పడ్డ రైతులు
- ప్రజావాణిలో ఆవేదన.. ఎమ్మార్వోకు వినతి



**కారేపల్లి, నేడు న్యూస్:** అమాయక గిరిజన రైతులను ఆశ చూపించి మొక్కజొన్న విత్తనాలు వేయించి, పంట చేతికొచ్చే సమయానికి ఆర్గనైజర్లు ముఖం చాటేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. సింగరేణి మండలంలోని రేలకాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తవసిబోడు గిరిజన రైతులు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమకు జరిగిన అన్యాయంపై తహసీల్దార్ (ఎమ్మార్వో) ఓరుగంటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. వైరాకు చెందిన ఆర్గనైజర్ ఎస్.కె సైదా, తవసిబోడుకు చెందిన ఏజెంట్ భూక్యా చందర్ ద్వారా స్థానిక రైతులను సంప్రదించారు. క్రిస్టల్ కంపెనీకి చెందిన '662 సీడ్స్' (ఆడ, మగ మొక్కజొన్న రకం) సాగు చేస్తే క్వింటాకు రూ. 3,200 చెల్లిస్తామని నమ్మబలికారు. ఈ హామీలను నమ్మిన రైతులు సుమారు 45 ఎకరాల్లో పంట సాగు చేశారు. పంట కోతకు సిద్ధమైన సమయంలో ఆర్గనైజర్లను సంప్రదించగా స్పందన లేకపోవడం రైతులను ఆందోళనకు గురి చేసింది. ఇక కంపెనీని అడగగా తమ వద్ద అలాంటి విత్తనాలే లేవని చెప్పడంతో రైతులు షాక్‌కు గురయ్యారు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టిన రైతులు ఇప్పుడు పంటను ఎలా అమ్ముకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సంబంధిత ఆర్గనైజర్లను వెంటనే పిలిపించి తమ పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, తమకు జరిగిన నష్టానికి పరిహారం కల్పించాలని బాధిత రైతులు ఎమ్మార్వోను వేడుకున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తమను ఈ సంక్షోభం నుండి గట్టెక్కించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నరేందర్, రమేష్, వీరబాబు, నాగేశ్వరరావు, రాంబాబు, సీతారాం, దీప్లా, రాంచంద్, బాల తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి దిశగా గాదెపాడు..

### సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**కారేపల్లి, నేడు న్యూస్:** మండలంలోని గాదెపాడు గ్రామపంచాయతీ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ఉపాధి హామీ పథకం (ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) కింద మంజూరైన రూ. 8 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు సిసి రోడ్లకు గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేసి, గ్రామంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం లక్ష్యమని సర్పంచ్ రంజిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.



# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన

- సే నో టు సింగల్ యూజ్ ప్లాస్టిక్
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజినీర్ బి. రాజేందర్ పిలుపు

**మేడ్చల్ నేడు బ్యూరో:** ప్రజా పాలన – 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో " సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ " పై హోలీ ట్రినిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజ్, భోగారంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ జి.లింగయ్య సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి పాటించాల్సిన నియమాలు, ప్రత్యామ్నాయ మార్గాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కొంతమంది విద్యార్థులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజినీర్ బి. రాజేందర్ లు పాల్గొన్నారు.

## ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు

**ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన గడ్డం రవికుమార్**



**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు "బండారి రాజిరెడ్డి కారిడార్"గా నామకరణం చేయడంపై ఉప్పల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం రవికుమార్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన నాయకుడి సేవలను స్మరించుకుంటూ ఈ నామకరణం చేయడం విశేషమని తెలిపారు. ఈ నిర్ణయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు ఉప్పల్ ప్రజల్లో మరింతగా నిలిచిపోతుందని అన్నారు. భవిష్యత్తులో ఉప్పల్ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బండారి రాజిరెడ్డి కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా, ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ తరఫున దీర్ఘకాలంగా సేవలందించిన నాయకుడని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సముచిత గుర్తింపు లభిస్తోందని ఆయన తెలిపారు.



## గార్బేజ్-ఫ్రీ సిటీ దిశగా కీసర ముందడుగు

**రహదారులపై డస్ట్ బిన్ల తొలగింపు!**

**ఇకపై ఇంటికే చెత్త సేకరణ వాహనం కొత్త పద్ధతులతో పారిశుధ్యం"**

**కీసర నేడు న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, కీసర సర్కిల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరాలను 'గార్బేజ్–ఫ్రీ' (చెత్త రహిత) నగరాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో, ప్రధాన రహదారులపై ఉన్న డస్ట్ బిన్లను తొలగించాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత ఆదేశాల మేరకు, దమ్మాయిగూడ డివిజన్, బండ్లగూడ నుండి హరిదాసుపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న చెత్త డస్ట్ బిన్లను సిబ్బంది తొలగించారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి, ముగ్గులతో సుందరీకరించారు. రహదారుల పక్కన డస్ట్ బిన్లు ఉండటం వల్ల చెత్త పేరుకుపోయి, దుర్వాసన వస్తుందని గుర్తించిన అధికారులు, ఈ పద్ధతిని మార్చారు. ఇకపై ప్రజలు ఇష్టారీతిన రహదారులపై చెత్తను వేయకుండా, ప్రతి ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికే చెత్తను అందించాలని సూచించారు. సేకరించిన చెత్తను నేరుగా ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తారు. ఈ మార్పు వల్ల రహదారులు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా, పట్టణాల్లో పారిశుధ్య ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ సంతోష్, ఏఈ అనిల్, నాక్ ఇంజనీర్ అశ్విని, ఎస్ ఎఫ్ ఏ అజార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## జవహర్ నగర్ లో పేద పిల్లలందరికీ విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలి

**మేడ్చల్ జిల్లా యు.ఎస్.ఎఫ్.ఐ కార్యదర్శి బ్యాగరి వెంకటేష్ డిమాండ్**


**మేడ్చల్ నేడు బ్యూరో:** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్ కార్పోరేషన్ పరిధిలో విద్యార్థుల కోసం కేటాయించిన నాలుగు ఎకరాల భూమిని కోర్టు ద్వారా తీసుకుని, ఇక్కడ అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను ఏర్పాటు చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ( యు.ఎస్.ఎఫ్.ఐ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాకు వివరాలు విడుదల చేస్తూ, జవహర్ నగర్ లో ప్రభుత్వ పాఠశాలాలు, కళాశాలలు అందుబాటులో లేక పోవడం వల్ల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న పేద విద్యార్థులకు పాఠశాలలు లేక పసిప్రాయంలోనే బాలకార్మికులుగా మారుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి బాలల పరిస్థితిపై పూర్తి పరిశీలన చేసి, తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి సమర్పించిన వినతి పత్రంలో కోరారు.


# బఫర్ జోన్‌లో 'హైడ్రా' అనుమతుల మాయజాలం..!

## నకిలీ ఎన్‌ఓసీ తో దర్జాగా అక్రమ నిర్మాణం.?

**కూకట్‌పల్లి, నేడు న్యూస్:** నగరంలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్న వేళ, ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. హైదర్ నగర్ డివిజన్ శుభోదయ కాలనీలోని అంబీర్ చెరువు బఫర్ జోన్‌లో నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్లాట్ నెం–67లో భారీ అక్రమ నిర్మాణం కొనసాగుతుండటం స్థానికులను కలవరపెడుతోంది. వివరాల్లోకి వెళ్తే... సుమారు 200






గజాల స్థలంలో సదరు యజమాని స్టిల్ట్ ప్లస్–4 అంతస్తులకు అనుమతులు పొంది నిర్మాణం చేపట్టాడు. ముఖ్యంగా, ఎలాంటి సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా అక్రమంగా నిర్మాణం కొనసాగుతుండటం, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### నకిలీ ఎన్‌ఓసితో అధికారులను బురిడి.?

ఇందులో అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే... ఈ స్థలంలో దాదాపు సగభాగం, అంటే సుమారు 100 గజాలు అంబీర్ చెరువు బఫర్ జోన్ పరిధిలోకి ఉంది. పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారం, చెరువుల బఫర్ జోన్‌లో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు అనుమతించబడవు. అయినప్పటికీ, ఈ నియమాలను పూర్తిగా పట్టించుకోకుండా నిర్మాణం దూసుకుపోతుండటం స్థానికులలో ఆందోళన రేకెత్తిస్తోంది. స్థానికులు ఈ విషయంపై నిర్మాణదారుడిని ప్రశ్నించగా, తాను హైడ్రా విభాగం నుండి ఎన్ ఓ సి పొందినట్లు పత్రాలను చూపిస్తున్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పత్రాలు అసలువా లేక నకిలీవా అనేది తేలాల్సి ఉంది. ఈ పత్రాల ఆధారంగా టౌన్ ప్లానింగ్ అధికారులను కూడా తప్పుదారి పట్టించి అనుమతులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆల్విన్ కాలనీ సర్కిల్ మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ నిర్మాణం జరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యమా..? లేక సహకారమా..?

ఇది అధికారుల నిర్లక్ష్యమా..? లేక సహకారమా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత బహిరంగంగా సదరు నిర్మాణదారుడు అంబీర్ చెరువు బఫర్ జోన్ లో ఎలాంటి సెట్ బ్యాక్స్ వదలకుండా నిర్మాణం చేపడుతుంటే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న హైడ్రా అధికారులకు తెలవకుండానే ఉన్నదా..? లేదా తెలిసి కూడా తెలవనట్టు నటిస్తున్నారా..? అన్న ప్రశ్నలు ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బఫర్ జోన్‌లో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణంపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, నకిలీ ఎన్ ఓ సిపై దర్యాప్తు జరిపి, బాధ్యులపై వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## పిల్లలను ధర్మ మార్గంలో నడిపించండి

- మారుతీ నగర్ హిందూ సమ్మేళనంలో శ్రీ దుర్గానందపురి స్వామీజీ
- దేశం, ధర్మం మాటలలో కాకుండా చేతలలో చూపించాలి




**బోడుప్పల్, నేడు న్యూస్:** పిల్లలను చిన్ననాటి నుండి ధర్మ మార్గంలో నడిపించాలని శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి కాశీ విశ్వనాథ పీఠం పీఠాధిపతి శ్రీ దుర్గానందాపురి స్వామిజీ అన్నారు. మారుతీ నగర్ బస్తి హిందూ సమ్మేళనం శ్రీ దాసాంజనేయ స్వామి సహిత శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మారుతీ నగర్ బస్తీ 30 కాలానీల హిందూ సమ్మేళనం వివిధ కాలనీవాసులతో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో సంవృద్ధి డాన్స్ స్కూల్ చిన్నారుల నృత్య ప్రదర్శన, వివిధ కాలనీల నుండి విచ్చేసిన ప్రతినిధులు పాడిన హైందవ ధర్మ గీతాలు, ప్రొఫెసర్ డా. వెంకటరమణ 'అల్లూరి సీతారామ రాజు' ఏకపాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హిందూ సమ్మేళనం ఆహ్వాన సమితి అధ్యక్షులు సిలివేరు శంకర్ ప్రజాపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి కాశి విశ్వనాథ పీఠం పీఠాధిపతి శ్రీ దుర్గానందాపురి స్వామిజీ మాట్లాడుతూ.. దేశం, ధర్మం అనే విషయాలలో కేవలం మాటలలో కాకుండా చేతలలో కూడా ముందుకు వచ్చే చైతన్యం, ధైర్యం అందరికి ఉండాలన్నారు. విశిష్ట అతిధిగా విచ్చేసిన గీతా పరివార్ రాష్ట్రీయ ప్రచారక్ డా. శిల్పా దీదీ మాట్లాడుతూ.. కుటుంబ



వ్యవస్థ విలువలతో బలోపేతం కావాలని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు లక్షల మొక్కలు నాటాలని, దేశ పౌరుడుగా మన బాధ్యతలు విధులు ఇంట్లో వున్నా తల్లిదండ్రుల నుండే మొదలవ్వాలి. పిల్లలకు మంచి చెడు వ్యత్యాసాన్ని బోధించి ధర్మ మార్గంలో నడిపించాలన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కట్ట రాజగోపాల్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో మనమందరం ఈ రకంగా ప్రత్యక్షంగా పాల్గొని మన హిందుత్వ వైభవాన్ని చాటిచెప్పడం గొప్ప విషయము మాత్రమే కాదని, మనకు అత్యంత గౌరవమని, సంఘంలో వ్యక్తి నిర్మాణం ఏ రకంగా జరుగుతుందో స్వయం సేవకులను చూస్తే అర్థమౌతుందన్నారు. గౌరవ అతిధి గా విచ్చేసిన రిటైర్డ్ డివిషనల్ మేనేజర్ ఒఐసిఎల్, హై కోర్ట్ న్యాయవాది గడప నాగయ్య మాట్లాడుతూ.. 30 కాలనీల సంగమంగా సమాజంలో ఏకాత్మత భావం చాటే విధంగా సమైక్యతను జాగృతం చేయడంకోసం హిందూ సమ్మేళనాలు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సమితి ప్రధాన కార్యదర్శి వడ్ల ముత్యమా చారి, ఉపాధ్యక్షులు ఎన్.రామచంద్ర మూర్తి, ఎం.జగన్నాథం, అరుణ్ కుమార్ పాండే, జి.యాదగిరి, అర్థ ధర్మ రెడ్డి, ఇ.లక్ష్మీనారాయణ, జి. చంద్రశేఖర్, బచ్చు గణేశం, కార్యదర్శులు వినోద్, జి.రాజి రెడ్డి, రమేష్ గౌడ్, మహిళా సభ్యులు సిలివేరు శ్యామారాణి, నర్మద, గౌరీ, సులోచన, కె. విజయలక్ష్మి, 30 కాలనీల అధ్యక్షులు, కార్యవర్గం, ఉప్పల్ బాగ్, బోడుప్పల్ నగర్ ఆర్ఎస్ఎస్, వీహెచ్ పీ నాయకులు, వందలాది హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ప్రెస్‌క్లబ్ భవనం అందుబాటులోకి తేవాలి

**జోనల్ కమిషనర్, తహసీల్దార్, ఏసీపీకి వినతిపత్రాలు**

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ సభ్యులు ప్రెస్ క్లబ్ భవనాన్ని అందరికి అందుబాటులోకి తీసుకురావాలని లేకపోతే ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని అధికారులను కోరారు. సోమవారం క్లబ్ అధ్యక్షుడు వడ్డెపల్లి కిషోర్ నాయకత్వంలో సభ్యులు ఉప్పల్ జోనల్ కమిషనర్, ఉప కమిషనర్, తహసీల్దార్, ఏసీపీ, ఉప్పల్ పోలీస్ స్టేషన్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. సుమారు పది సంవత్సరాల క్రితం ఉప్పల్ ప్రాంతంలో పనిచేస్తున్న పాత్రికేయులు కలిసి ఉప్పల్ ప్రధాన రహదారి పక్కన మున్సిపల్ భూమిపై ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించారని తెలిపారు. అయితే ఇటీవల ప్రెస్ క్లబ్ మూడు వర్గాలుగా విడిపోయిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పదిమందికంటే





తక్కువ సభ్యులు ఉన్న ఒక వర్గం భవనం తాళాలు తమ వద్ద ఉంచుకుని బలవంతంగా ఆధిపత్యం చెలాయిస్తూ, మిగతా సభ్యులను లోపలికి అనుమతించడం లేదని ఆరోపించారు. దాదాపు 85 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు భవనంలో ప్రవేశం లేకుండా, తాళాలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. సమిష్టిగా నిర్మించిన ఈ భవనాన్ని అందరికీ సమానంగా ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుమతి కల్పించాలని వారు అధికారులను కోరారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే, ప్రస్తుతం అక్రమంగా ఆక్రమణలో ఉన్న భవనం, భూమిని తిరిగి ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## అర్హులందరికీ ఐటిడిఎ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- కొండబోయిన నాగేశ్వరరావు
- ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన సీపీఎం నాయకులు

**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండలంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఐటిడిఎ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ, గతంలో గ్రామసభల ద్వారా ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను కొత్త పాలకవర్గం తొలగించకూడదని కోరారు. ఎల్–1, ఎల్–2, ఎల్–3 లబ్ధిదారుల జాబితాల్లో రాజకీయ ప్రభావం, ఆర్థిక లావాదేవీల కోసం మార్పులు చేయడం సరికాదని స్పష్టం చేశారు. అలాగే లబ్ధిదారుల నుండి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు జరుగుతున్న బలవంతపు వసూళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పేదల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం అన్యాయమని, అర్హతే ప్రధాన ప్రమాణంగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రావాల్సిన రూ.60 వేల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రం సమర్పణలో సీపీఎం మండల కార్యదర్శి కె. నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



## సృజన స్కూల్‌తో విద్యా రంగంలో సరికొత్త మార్పు ఆరంభం

**మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ ప్రాంతంలో కీ.శే. రఘునందన్ రెడ్డి ప్రారంభించిన సృజన స్కూల్‌తో విద్యా రంగంలో సరికొత్త మార్పు మొదలైందని మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు కూడా ఇంగ్లీషు మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందించిన ఘనత రఘునందన్ రెడ్డిదేనని తెలిపారు. ఉప్పల్ శిల్పారామంలో సృజన హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా కాకుండా సేవా దృక్పథంతో సృజన స్కూల్‌ను నడిపిన రఘునందన్ రెడ్డి సేవలను గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో వారి కుటుంబ సభ్యులు సంస్థను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణే పునాది.. విద్యే ఆయుధం, మత్తు వదలండి -- మైదానానికి రండి, మత్తు వదలండి .. చదువుతో సత్తా చాటండి అనే నినాదం కేవలం మాటగా కాకుండా, విద్యార్థుల జీవితాల్లో ఆచరణలో ఉండాలని సూచించారు. పాఠశాలలను దేవాలయాలుగా భావించి అంకితభావంతో చదివితేనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యార్థుల్లో సానుకూల మార్పు వచ్చి మంచి సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ శ్రీలత రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ రెడ్డి, వైస్ చైర్మన్ సుజీత్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ అలేఖ్య రెడ్డి, ప్రిన్సిపల్ ప్రతిభ, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, అల్వాల్ భాస్కర్, అలుగు అనిల్, విజయ్ కుమార్, రాజు, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్యూబాకు వెళ్లే రష్యా చమురు నౌకతో
# మాకు సమస్య లేదు : ట్రంప్



**వాషింగ్టన్ :** చమురు సంక్షోభంలో కూరుకుపోయిన క్యూబాకు అమెరికా ఒకింత ఊరట కల్పించింది. ఆ దేశానికి వెళ్లే రష్యా చమురు నౌకకు అనుమతిస్తామని వెల్లడించింది. గత కొంతకాలంగా క్యూబాకు చమురు రవాణా విషయంలో ట్రంప్ ఆంక్షలు పెట్టగా.. తాజాగా వాటిని కాస్త సడలించడం గమనార్హం. 7.3 లక్షల బ్యారెళ్ల ముడిచమురుతో రష్యా నౌక 'అనాటోలీ కొలోడ్కిన్' మార్చి 8న రష్యా పోర్ట్ నుంచి బయల్దేరింది. ఇంగ్లిష్ ఛానల్ మీదుగా అట్లాంటిక్ చేరుకుంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఈ నౌక క్యూబాను చేరుతుందా, లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలోనే దీనిపై ట్రంప్ తాజాగా స్పందించారు. "ఇప్పటికిప్పుడు క్యూబాకు చమురు చేరవేయాలని ఏ దేశం అనుకున్నా దాంతో నాకు సమస్య లేదు. అది రష్యా అయినా, కాకపోయినా నాకేం ఇబ్బంది లేదు. త్వరలోనే క్యూబా ప్రభుత్వం నేలకూలుతుంది" అని ట్రంప్ అన్నారు. ఆ తర్వాత రష్యా చమురు నౌకకు అనుమతినిస్తున్నట్లు అమెరికా మరో ప్రకటన చేసింది. ఈ నౌక మంగళవారం క్యూబాకు చేరుకునే అవకాశం ఉంది. వెనెజువెలా అధ్యక్షుడు మదురో నిర్బంధం తర్వాత నుంచి ఆ దేశానికి చమురు రవాణా నిలిచిపోయింది. వారికి చమురు చేరవేసే దేశాలపై అధికంగా సుంకాలు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఒకానొక సమయంలో క్యూబాను స్వాధీనం చేసుకుంటానన్న వ్యాఖ్యలూ తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. ఈ క్రమంలోనే చమురు సంక్షోభం ఏర్పడటంతో అక్కడి ప్రజారవాణాపై తీవ్ర ప్రభావం పడింది. కొన్ని విమానాలూ నిలిచిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు నౌక వెళ్లడం క్యూబాకు కాస్త ఊరటనిచ్చే విషయం.

## త్వరలో ఒప్పందం కుదరకపోతే..
## సర్వనాశనమే : ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

**వాషింగ్టన్ :** ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. "ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ప్లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం" అని హెచ్చరించారు.



## కువైట్ పవర్‌ప్లాంట్‌పై క్షిపణి దాడి..
### భారతీయుడు మృతి

**కువైట్ :** పశ్చిమాసియాలో యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. తాజాగా కువైట్‌లోని విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారాలపై ఇరాన్ దాడికి పాల్పడింది. ఈ ఘటనలో భారత్‌కు చెందిన ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ మేరకు కువైట్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ క్షిపణి దాడి కారణంగా విద్యుత్, నీటిశుద్ధి కార్మాగారం వద్ద ఓ సర్వీస్ భవనం దెబ్బతిందని కువైట్ అధికారులు తెలిపారు. అయితే, ఈ ప్లాంట్ ఏ ప్రాంతంలోనిదో మాత్రం బయటపెట్టలేదు. ఘటన నేపథ్యంలో టెక్నికల్, ఎమర్జెన్సీ సహాయక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. ప్లాంటు నిర్వహణ, అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇదిలాఉండగా, యూఏఈలో ఇటీవల ఓ భారతీయుడు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇరాన్ క్షిపణులను యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో.. దాని శకలాలు ఓ వీధిలో పడి భారతీయుడు సహా మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.



## బీఎస్సీ విద్యార్థిని తిరునాయన తల్లి, అనుచరుల ఆరోపణలు అసత్యం

- కళాశాల ప్రిన్సిపాల్
- బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ
- లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ప్రెస్ సమావేశంలో వెల్లడి

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం డేటా సైన్స్ చదువుతున్న విద్యార్థిని తిరునాయనపై వచ్చిన వేధింపుల ఆరోపణల నేపథ్యంలో కళాశాల యాజమాన్యం సోమవారం ప్రెస్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్ రెవ్ బ్రదర్ జాన్ కల్లారక్కల్, ప్రిన్సిపాల్ పి. జయం తిరెడ్డి, డాక్టర్ ఎం. ప్రశాంత్ (ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్)తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థిని తల్లి మరియు ఆమె అనుచరులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. సంబంధిత విద్యార్థిని తరగతులకు సక్రమంగా హాజరుకావడం లేదని, అవసరమైన హాజరు శాతం లేకపోవడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం ఆమెకు పరీక్షలకు హాజరయ్యే అర్హత లేదని తెలిపారు. ఈ విషయాన్ని ముందుగానే విద్యార్థిని మరియు ఆమె తల్లికి తెలియజేసినప్పటికీ, ఇప్పుడు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ కళాశాల ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. మొదటి సంవత్సరం సమయంలో ఆరోగ్య సమస్యల కారణంగా మెడికల్ సర్టిఫికేట్ సమర్పించడంతో కొంత సడలింపు ఇచ్చామని, రెండో సంవత్సరం కూడా ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయని వివరించారు. కళాశాల తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆరోపణలపై ఇప్పటికే కళాశాల అంతర్గత కమిటీ ద్వారా విచారణ జరిపినట్లు తెలిపారు. విద్యార్థిని భవిష్యత్తుపై తమకు ఇంకా ఆందోళన ఉందని యాజమాన్యం పేర్కొంది. ఇదే సమయంలో కొందరు వ్యక్తులు, రాజకీయ నాయకులతో కలిసి కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గ్యాస్ మాఫియా 'యుద్ధ' తంత్రం

- రూ. 1960 సిలిండర్ రూ. 5500 !
- కాల్ రికార్డింగ్‌లో బయటపడ్డ దందాగాళ్ల బాగోతం
- యుద్ధం వల్ల రేట్లు పెరిగాయి.. కావాలంటే తీసుకో, లేదంటే లేదు
- చిన్న వ్యాపారుల కష్టకాలంలోనూ ఆగని 'బ్లాక్' దందా



కమర్షియల్ గ్యాస్ సిలిండర్ రీఫిలింగ్ చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫోటో)

**మేడ్చల్, నేడు న్యూస్ :** పేద, మధ్యతరగతి ప్రజల అవసరాలే పెట్టుబడిగా గ్యాస్ మాఫియా సాగిస్తున్న అరాచకం పరాకాష్టకు చేరింది. ఎక్కడో జరుగుతున్న యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ, స్థానికంగా కృత్రిమ కొరత సృష్టించి సామాన్యుడి రక్తాన్ని జుర్రుకుంటున్నారు. తాజాగా బయటపడ్డ ఒక ఆడియో కాల్ రికార్డింగ్ గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందా ఎంత క్రూరంగా సాగుతుందో కళ్లకు కడుతోంది.

**కాల్ రికార్డింగ్‌లో దిగ్భ్రాంతికర విషయాలు :**

ఒక చిన్న వ్యాపారి (నరేష్) మరియు గ్యాస్ సరఫరా చేసే వ్యక్తి(ప్రేమ్) మధ్య జరిగిన సంభాషణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. వారి మాటల్లో కేవలం రెండు రోజుల క్రితం రూ. 4000 ఉన్న సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ. 5500 కు పెంచేశారు. అసలు ప్రభుత్వ ధర రూ. 1960 ఉంటే, దానికి రెండున్నర రెట్లు అదనంగా వసూలు చేస్తున్నారు. మొన్నటి వరకు రూ. 1960 కే ఇచ్చాం, కానీ యుద్ధం మొదలయ్యాక ధరలు మారిపోయాయి, స్టాక్ రావడం లేదంటూ సరఫరాదారుడు బుకాయించడం గమనార్హం. గ్యాస్ లేకపోతే హోటల్ నడవదు, రేపు వచ్చే గిరాకీ పోతుంది.. కాబట్టి తప్పక కొంటున్నాను అంటూ ఆ వ్యాపారి పడుతున్న వేదన వర్ణనాతీతం. కష్టకాలంలో మేము మీకు గ్యాస్ ఇస్తున్నాం కాబట్టి, రేపు పరిస్థితులు చక్కబడ్డాక కూడా మా దగ్గరే గ్యాస్ తీసుకోవాలి అంటూ దందాగాళ్ల షరతులు విధిస్తుండటం వారి బరితెగింపుకు నిదర్శనం.



గతంలో వెయిట్ మిషన్, కమర్షియల్ సిలిండర్లను సీజ్ చేసిన మేడ్చల్ పోలీసులు (ఫైల్ ఫోటో)

**చిన్న వ్యాపారుల కన్నీళ్లు..:**


మేడ్చల్ మండలంలో వేలాది మంది చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఒక సిలిండర్ కేవలం 4 నుండి 5 రోజులు మాత్రమే వస్తుందని, ప్రతి వారం గ్యాస్ కోసం రూ.10 వేల వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు ఏమీ తెలియనట్టు నిద్రపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులు మేల్కొనేది ఎప్పుడు ? :**

వ్యాపారుల మధ్య జరుగుతున్న ఈ కాల్ రికార్డింగ్లే సాక్ష్యంగా కనిపిస్తున్నా, పత్రికల్లో ప్రచురితమవుతున్న ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీల నుంచి సిలిండర్లు ఎక్కడికి వెళ్తున్నాయి ? బ్లాక్ మార్కెట్ కు ఎలా చేరుతున్నాయి ? అనే అంశాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దోపిడీ ఇలాగే కొనసాగితే సామాన్యుడి కడుపు మంట చివరకు రోడ్డెక్కే ప్రమాదం ఉంది. తక్షణమే విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి ఈ 'యుద్ధ తంత్రం' పేరుతో దోచుకుంటున్న మాఫియా ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు
# బండారి రాజిరెడ్డి పేరు

- ప్రభుత్వం జి.ఓ. ఎం.ఎస్. నెం.104 జారీ
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆనందం
- మాజీ ఎమ్మెల్యే సేవలకు గౌరవంగా నామకరణం
- ప్రభుత్వానికి బండారి కుటుంబం కృతజ్ఞతలు



**ఉప్పల్ నేడు న్యూస్:** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఉపయోగకరమైన ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ కు శ్రీ బండారి రాజిరెడ్డి కారిడార్ గా నామకరణం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎం.ఎస్. నెం.104పై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను స్మరించుకుంటూ ఈ నామకరణం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సహకారం అందించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తమ కుటుంబానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీతో ఐదు దశాబ్దాల అనుబంధం ఉందని తెలిపారు. తమ తల్లి మల్లాపూర్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ తరపున వార్డ్ సభ్యురాలిగా గెలిచి ప్రజలకు సేవలందించినట్లు గుర్తుచేశారు. తన అన్న బండారి రాజిరెడ్డి కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా, తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు సభ్యునిగా కాంగ్రెస్ పార్టీ తరఫున దీర్ఘకాలం సేవలందించినట్లు తెలిపారు. 2019లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డి విజయానికి బండారి రాజిరెడ్డి కృషి చేసినట్లు పేర్కొన్నారు. 2014లో తాను కాంగ్రెస్ పార్టీ తరఫున ఉప్పల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి, అనంతరం నియోజకవర్గ ఇంచార్జిగా సేవలందించినట్లు చెప్పారు. 2023లో కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ తరఫున టికెట్ ఇవ్వడంతో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. తన అన్న బండారి రాజిరెడ్డి అందించిన సేవలను గుర్తించి, ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డికి బండారి కుటుంబం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## ఎలివేటెడ్ కారిడార్‌క రాజిరెడ్డి పేరు పెట్టడంపై అభ్యంతరం

- మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్
- అటల్ బిహారి వాజ్‌పేయి పేరును పెట్టాలని డిమాండ్



**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మించిన ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి కారిడార్ గా పేరు పెట్టుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నిర్ణయంపై బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన ఎమ్మెల్యే పదవీకాలంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఈ పనులు ప్రారంభమయ్యాయని, పూర్తి ప్రాజెక్టు కూడా కేంద్ర నిధులతోనే అమలు అయ్యిందని పేర్కొన్నారు. ప్రాజెక్టుతో సంబంధం లేని వ్యక్తుల పేర్లు పెట్టడం సరైంది కాదని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి పేరు పెట్టాలని సూచించారు. లేకపోతే తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

## సింగరేణి నూతన తహశీల్దార్‌ను కలిసిన సర్పంచులు



**సింగరేణి, నేడు న్యూస్:** సింగరేణి మండల తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఓరుగంటి వెంకటేశ్వర్లును మండలంలోని ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొట్లగూడెం సర్పంచ్ పొడుగు పెంటయ్య ఆధ్వర్యంలో టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్, టీపీసీసీ వైరా అసెంబ్లీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కనకం పవన్ కళ్యాణ్ పాల్గొని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా భూ సంబంధిత సమస్యల పరిష్కారం, రెవెన్యూ సేవలు, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండల అభివృద్ధి మరియు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా సర్పంచులు తెలిపారు. మండల ప్రజల తరఫున తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అత్రాస్‌పల్లిలో శ్రీరామనవమిన ఎస్సీలను అవమానపరచడం అనాగరికం

- సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్
- విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ జిల్లా మూడు చింతల పల్లి మండలం అత్రాస్ పల్లి గ్రామంలో శ్రీరామనవమిన రామాలయం దగ్గర ఎస్సీ మహిళలు కొబ్బరికాయలు కొడుతుంటే కులం తక్కువ వారని కొబ్బరికాయలు కొట్టవద్దని కొంతమంది మహిళలు కులం పేరుతో దూషించడం, అన్నదానం చేసే సమయంలో ఎస్సీ కులస్తులు తక్కువ స్థాయి వాళ్ళు వడ్డించడమేమిటని ప్రశ్నించి అవమానపరచడం నాగరిక సమాజంలో అనాగరికమైన సంఘటన అని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కే. ఏసురత్నంలు అన్నారు. ఈ సంఘటనను తెలుసుకొని సోమవారం వారు గ్రామాన్ని సందర్శించి, సంఘటన వివరాలను అడిగి తెలుసుకన్నారు. ఈ సందర్భంగా ఇక్కడి దళితులు మాట్లాడుతూ, గ్రామంలో దేవాలయానికి అన్ని కులాలతో సమానంగా పూజారికి మేము కూడా జీతాలను ఇస్తున్నామని, అన్ని పండుగలు సందర్భంలో జరిగే ఖర్చులను గ్రామంలోని ప్రతి కులం వారు సమానంగా ఖర్చు పెడుతున్నారని, అదేవిధంగా తాము చందాలు ఇస్తున్నామన్నారు. ఈ పండుగల సందర్భంగా చందాలను సమానంగా వసూలు చేస్తున్నప్పటికీ కులం తక్కువ అనే వ్యత్యాసం గతం నుంచి జరుగుతూనే ఉన్నదని, కొంత మంది మహిళలు రెచ్చగొట్టి మమ్మల్ని అవమాన పరుస్తున్నారని మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని వారు సిపిఐ నాయకులకు వివరించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్.ఐ.ఆర్ నమోదు జరిగిందే తప్ప, ఇంకా ఏలాంటి విచారణ జరగలేదని, ఇప్పటికైనా విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించి, మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు దోరవి బాబు, సిపిఐ మండల కార్యదర్శి నరేంద్ర ప్రసాద్ రాములు గౌడ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహారెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఉపసర్పంచ్ జహంగీర్, గ్యార చంద్రయ్య, రాములు, బాలయ్య పాల్గొన్నారు.

## పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు
### నో చెప్పిన ఇరాన్



**ఇరాన్ :** పశ్చిమాసియాలో ఘర్షణల ముగింపు కోసం అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తామని పాకిస్థాన్ ప్రకటనలు చేసింది. అయితే పాక్ ప్రయత్నాలకు ఇరాన్ నో చెప్పింది. ఆ విషయంలో తమ ప్రమేయం ఏమీ లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు ముంబయి లోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ఎ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "అమెరికాతో ప్రత్యక్ష చర్చలు ఏమీ లేవు. అవన్నీ మధ్యవర్తుల ద్వారా బయటకు వచ్చిన అసమంజసమైన డిమాండ్లు మాత్రమే. దౌత్యం విషయంలో అమెరికా తరచూ మాటమారుస్తోంది. మా వైఖరి మాత్రం స్పష్టంగా ఉంది. పాక్ మధ్యవర్తిత్వ ప్రణాళికలు వారి సొంతమే. వాటిలో మా ప్రమేయం లేదు. యుద్ధం ముగింపు కోసం ఇస్తున్న పిలుపు స్వాగతించదగినవే. కానీ యుద్ధాన్ని ప్రారంభించింది ఎవరో గుర్తుంచుకోండి" అని కాన్సులేట్ జనరల్ పేర్కొంది. ఇటీవల ఇస్లామాబాద్‌లో పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో సౌదీ అరేబియా, ఈజిప్ట్, తుర్కియే మంత్రులు సమావేశమయ్యారు. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా ఘర్షణల కారణంగా మిగిలిన దేశాలపై పడుతోన్న ప్రభావం గురించి చర్చించారు. పాక్‌లో జరగబోయే ఇరాన్-అమెరికా ప్రత్యక్ష చర్చలకు ఆ దేశాల మంత్రులు పూర్తి మద్దతు ఇచ్చారని ఇషాక్ ప్రకటించారు. ఈ విషయంలో ఇరాన్, యూఎస్‌ఏ యంత్రాంగంతో చర్చలు జరిపామని చెప్పారు. ఇప్పుడు ఈ ప్రయత్నాల్లో తమ ప్రమేయం ఏమీ లేదని ఇరాన్ చెప్పడం గమనార్హం.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

## స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు



**హైదరాబాద్, మార్చి 30 :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్లు ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ధమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.




# రాజస్థాన్ రాయల్స్‌దే విజయం

## వైభవ్ సూర్యవంశీ విధ్వంసం

**గువాహటి:** ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ శుభారంభం చేసింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్కే 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. 128 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 12.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (52; 17 బంతుల్లో) చెలరేగాడు. ఇందులో 4 ఫోర్లు, 5





సిక్స్‌లున్నాయి. అతడు కేవలం 15 బంతుల్లోనే హాఫ్‌సెంచరీ సాధించడం విశేషం. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 36 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ధ్రువ్ జురేల్ (18; 9 బంతుల్లో, 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. రియాన్ పరాగ్ 14 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చెన్నై బౌలర్లలో అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లు తీసుకున్నాడు. మిగతా బౌలర్లు విఫలమయ్యారు. అంతకు ముందు చెన్నై సూపర్‌కింగ్స్ బ్యాటర్లలో ఎనిమిదో స్థానంలో వచ్చిన జేమీ ఓవర్టన్ (43; 36 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సర్ఫరాజ్ ఖాన్ 17, కార్తిక్ శర్మ 18 రన్స్ చేశారు. సంజు శాంసన్ (6), రుతురాజ్ గైక్వాడ్ (6), ఆయుష్ మాత్రే (0), మాథ్యూ షార్ట్ (2), శివమ్ దూబె (6) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, రవీంద్ర జడేజా తలో 2 వికెట్లు పడగొట్టారు. బ్రిజేశ్ శర్మ, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్ చెరో వికెట్ తీసుకున్నారు.



# రోహిత్ 2.0 రెడీ..

## ప్రత్యర్థులూ ఇక కాచుకోండి : అనిల్ కుంబ్లే

ఐపీఎల్ 2026 సీజన్‌ను రోహిత్ శర్మ సూపర్ ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టాడు. 200ం స్ట్రైక్‌రేట్‌తో హాఫ్ సెంచరీ సాధించిన అతడిపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. కేవలం 38 బంతుల్లోనే 78 పరుగులు చేసిన ముంబయి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఐపీఎల్‌లోని మిగతా జట్లను సున్నితంగా హెచ్చరించాడు. రోహిత్ 2.0 వచ్చేసిందని.. ప్రత్యర్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించాడు. "కోల్‌కతాపై రోహిత్ శర్మ ఆటను చూశాక.. ఒకటే చెబుదామని ఉంది. రోహిత్ 2.0 రెడీ.. మిగతా టీమ్‌లు జాగ్రత్తగా ఉండాలి అని చెబుతా. మైదానంలో అతడు బంతిని ఎదుర్కొన్న తీరును చూస్తే ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపినట్లు అనిపిస్తోంది. అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నప్పటి రోజులను మళ్లీ గుర్తు చేశాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, ముజరబాని వంటి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించడం అంత ఈజీ కాదు. అలవోకగా సిక్స్‌లు కొట్టేశాడు. తన ఫిట్‌నెస్ పైనా చాలా శ్రమించాడు. స్వల్ప విరామం తర్వాత మైదానంలోకి అడుగుపెడితేనే.. లయను అందుకోవడానికి కనీసం ఐదారు రోజులు పడుతుంది. కానీ, రోహిత్‌పై ఆ ప్రభావం ఏమీ చూపించినట్లు లేదు. తాజాగా కనిపించాడు. సిక్స్‌లు తనదైన శైలిలో తేలికగా బాదేశాడు. మైదానం కాస్త చిన్నదైనా సరే.. ఆ బంతి చాలా దూరం వెళ్లి స్టాండ్స్‌లో పడింది. అతడి దూకుడు చూస్తూ ఈ ఐపీఎల్ సీజన్‌లో తన ఉద్దేశం ఏంటో బ్యాట్‌తోనే చెప్పేశాడు" అని కుంబ్లే తెలిపాడు. ఆ విషయం ఆశ్చర్యమేసింది. "కోల్‌కతా బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ కీలకం. కానీ, నరైన్ తన నాలుగు ఓవర్ల కోటా కూడా పూర్తి చేయకపోయడం ఆశ్చర్యపరిచింది. రోహిత్-రికెల్టన్ దూకుడు మీదున్న పవర్‌ప్లేలో అతడికి బౌలింగ్ ఇవ్వకపోవడం నిరుత్సాహపరిచింది. నరైన్ బౌలింగ్‌కు వచ్చేటప్పటికే నష్టం జరిగిపోయింది. ఇక్కడే కేకేఆర్ తమ విజయావకాశాలను దెబ్బతీసుకుంది. వారి వనరులను కాస్త మెరుగ్గా వినియోగించుకోవాలి" అని కుంబ్లే సూచించాడు.

# నీ మిస్టరీ.. హిస్టరీగా మారింది

## వరుణ్‌ను హెచ్చరించిన క్రిష్



టీమ్‌ఇండియా మిస్టరీ స్పిన్నర్‌గా గుర్తింపుపొందిన వరుణ్ చక్రవర్తికి ఏదీ కలిసిరావడం లేదు. గత టీ20 ప్రపంచకప్ మొదట్లో అద్భుతంగా బౌలింగ్ వేసి.. క్రమంగా గతి తప్పిన సంగతి తెలిసిందే. భారీగా పరుగులు ఇచ్చిన అతడు.. అదే పంథాను ఇప్పుడు ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లోనూ కొనసాగించడం గమనార్హం. ముంబయితో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్ల కోటాలో 48 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్టూ తీయలేకపోయాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిని ప్రత్యర్థులు తేలికగా అవపోశన పట్టేశారంటూ మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ వ్యాఖ్యానించాడు. అతడి మిస్టరీ ఇక హిస్టరీగా మారిపోయిందని అభిప్రాయపడ్డాడు. "బంతిని విభిన్నంగా వేయడం, లెగ్ స్పిన్ సంధించడాన్ని నేర్చుకోనంతవరకూ వం- ుణ్ చక్రవర్తి ఇబ్బందిపడుతూనే ఉంటాడు. ఎప్పుడూ గూగ్లీలు వేయడమూ వర్కౌట్ కాదు. బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపించాలి. కొన్నిసార్లు లెగ్ స్పిన్ వేయాలి. ఇప్పుడైతే అతడి బౌలింగ్‌లో ఎలాంటి మిస్టరీ లేదు. అదంతా హిస్టరీగా మారిపోయింది. బ్యాటర్లకు కాస్త దూరంగా విసరాలి. అప్పుడు షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు ఇస్తారు. దీంతో తర్వాత వచ్చే బ్యాటర్లు కాస్త జంకుతారు. ఇక్కడ ఆయా జట్ల సారథులకూ ఓ మాట చెబుతున్నా. ఇప్పుడు వరుణ్‌కు పవర్ ప్లేలో బౌలింగ్ ఇవ్వొద్దు. ముంబయితో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఇలానే వరుణ్ వేసిన తొలి ఓవర్‌లో దూకుడుగా పరుగులు రాబట్టాడు. దాంతో వరుణ్ ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది" అని క్రిష్ తెలిపాడు.

# ఇండియన్ ఫుట్‌బాల్ చీఫ్‌పై.. మాజీ సీఎం కుమార్తె వేధింపుల ఆరోపణలు



ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ చీఫ్ కల్యాణ్ చౌబేపై వివాదంలో చిక్కుకున్నారు. ఆయనపై ఏఐఎఫ్ఎఫ్ మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా అలెమావో వేధింపుల ఆరోపణలు చేశారు. మార్చి 29న దిల్లీలోని ఫుట్‌బాల్ హౌస్‌లో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. తనను సీనియర్ అధికారులు హేళన చేశారని, వేధించారని ఆరోపించారు. భారత మహిళల ఆసియా కప్ క్యాంపెయిన్‌లో భాగంగా పాలనాపరమైన లోపాలను ఇటీవల ఆమె ఎత్తిచూపిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం. చౌబే, ఇతర సీనియర్ అధికారుల చర్యలను ప్రస్తావిస్తూ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు అలెమావో లేఖ రాశారు. "చౌబే, ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.హారిస్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.సత్యనారాయన్ ప్రవర్తనను మీ ముందు ఉంచాలనుకుంటున్నాను. నా గొంతు అణచివేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అధ్యక్షుడు నాతో అగౌరవంగా ప్రవర్తించారు. ఆయనతో కలిసి మిగిలినవారు స్వరం పెంచి, బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. సమావేశం జరుగుతున్నంతసేపు నన్ను టార్గెట్ చేశారు" అని ఆమె ఆరోపించారు. ఇండియా ఫుట్‌బాల్ పాలకవర్గంలో వాలంకా కీలక వ్యక్తి. చర్చిల్ బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్ గోవాకు ఆమె సీఈఓగా ఉన్నారు. ఆమె తండ్రి చర్చిల్ అలెమావో గోవా ముఖ్యమంత్రిగా పని చేశారు. కొన్నేళ్లపాటు ఆ క్లబ్‌ను నడిపించారు. ఫిఫా మహిళల ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన తొలి భారతీయురాలీమె. 2025 నుంచి 2029 వరకు ఆ హోదాలో కొనసాగుతారు.



# వాట్సప్, టెలిగ్రామ్‌కు ఊరట..

## 'సిమ్ బైండింగ్' డెడ్‌లైన్ పెంపు?

వాట్సప్, టెలిగ్రామ్, అరట్టై వంటి మెసేజింగ్ యాప్‌లకు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనల అమలు గడువును పొడిగించాలని కేంద్రం భావిస్తోంది. ఆయా టెక్ కంపెనీల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు డిసెంబర్ వరకు ఈ డెడ్‌లైన్ పెంచాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. టెలికాం విభాగానికి చెందిన ఉన్నతాధికారులను ఉటంకిస్తూ ఈ మేరకు ఆంగ్ల మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. సిమ్ బైండింగ్ అంటే సిమ్ లేకుండా ఆయా యాప్స్ ఫోన్‌లో పనిచేయవన్నమాట. గతేడాది నవంబర్‌లో ఈ నిబంధనలను కేంద్రం తీసుకొచ్చింది. వీటి అమలుకు 90 రోజుల గడువు విధించింది. అయితే ఈ నిబంధనల అమలుకు సాంకేతికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయా యాప్స్ కేంద్రం దృష్టికి తీసుకొచ్చాయి. టెస్టింగ్, ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్స్ వంటి విషయంలో సాంకేతిక సవాళ్లను ఎదుర్కొంటున్నామని ఫిర్యాదు చేశాయి. ఈ సవాళ్లను అధిగమించి సిమ్ బైండింగ్ నిబంధనలను పక్కాగా అమలుచేసేందుకు గానూ ఆయా సంస్థలకు మరికొంత సమయం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.




# సర్వీస్ సెంటర్ కష్టాలకు చెక్..

## మారుతీ సుజుకీ నుంచి 'క్విక్‌స్టాప్' సేవలు

నగర జీవితంలో కారును సర్వీసు సెంటరుకు తీసుకెళ్లి మళ్లీ సాయంత్రం తీసుకురావడం పెద్ద ప్రహసనమనే చెప్పాలి. ముఖ్యంగా ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది నిర్ణీత గడువుకు సర్వీసు సెంటర్‌కు తీసుకెళ్లలేక వాయిదా మీద వాయిదా వేస్తూ ఉంటారు. అదే సర్వీస్ సెంటర్ మీ ఆఫీసు కిందనే ఉంటే ఎంత బాగుంటుందో కదూ! సరిగ్గా ఇదే ఆలోచనతో ముందుకొచ్చింది ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మారుతీ సుజుకీ. 'క్విక్‌స్టాప్' పేరిట కొత్త తరహా సర్వీస్ సెంటర్లకు రూపకల్పన చేసింది. క్విక్‌స్టాప్ కాన్సెప్టులో భాగంగా కంటైనర్ల రూపంలో చిన్నపాటి కార్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తారు. తక్కువ స్థలంలో తక్కువ సమయంలో వీటిని ఏర్పాటుచేయొచ్చు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో వినియోగదారులకు వేగంగా సర్వీస్ అందించడం దీని ముఖ్య ఉద్దేశం. వాహన యజమానులు నిత్యం సందర్శించే ఆఫీస్ క్యాంపస్‌లు, ఎయిర్‌పోర్ట్ జోన్లు, ఫ్లీట్ హబ్‌ల వద్ద వీటిని ఏర్పాటు చేస్తారు. ఆఫీసుకి వెళ్లే వారు తమ కారును ఇక్కడ ఇచ్చి, సాయంత్రం పని ముగించుకొని తిరిగి వెళ్లేటప్పుడు సర్వీస్ పూర్తయిన కారును తీసుకెళ్లొచ్చు. సాధారణ మెయింటెనెన్స్, చిన్నపాటి మరమ్మతులు ఇక్కడ చేస్తారు. పైగా నీరు అవసరం లేని కార్ వాషింగ్, బ్యాటరీతో పనిచేసే పరికరాలను 'క్విక్‌స్టాప్'లో వినియోగిస్తారు. సర్వీసు సెంటర్లను సందర్శించేందుకు వినియోగదారులు పడుతున్న ఇక్కట్లను దృష్టిలోపెట్టుకొని 'క్విక్‌స్టాప్' ఆలోచనతో ముందుకొచ్చినట్లు మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో హిసాషీ టకేయుచి పేర్కొన్నారు. ఇది కస్టమర్ల వద్దకు చేరుకునే ఉద్దేశమని చెప్పారు. కార్పొరేట్ సంస్థలు, ఫ్లీట్ ఆపరేటర్లు స్థలం ఇస్తే ఆ స్థానంలో మారుతీ సుజుకీ డీలర్లు వీటిని నిర్వహిస్తారని తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో హైదరాబాద్, దిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, సూరత్ నగరాల్లో ఈ క్విక్‌స్టాప్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. వాహనదారుల నుంచి వచ్చిన ఆదరణ బట్టి మరిన్ని నగరాలకు విస్తరించనున్నారు.




# సెన్సెక్స్ 1636 పాయింట్లు పతనం

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రతరం అవుతుందన్న భయాలు, చమురు ధరల భగభగలు, ఇరాన్‌కు మద్దతుగా హూతీ గ్రూప్ రంగంలోకి దిగడం వంటి పరిణామాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 22,350 దిగువన ముగిసింది. మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9 లక్షల కోట్లు క్షీణించి రూ.412 లక్షల కోట్లకు చేరింది. మొత్తానికి ఆర్థిక సంవత్సరం చివరి రోజున సూచీలు నష్టాల్లో ముగిశాయి. మహవీర్ జయంతి సందర్భంగా రేపు (మార్చి 31) స్టాక్ ఎక్స్ఛేంజీలు పనిచేయవు. సెన్సెక్స్ ఉదయం 72,565.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,583.22) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 71,774.13 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1635.67 పాయింట్ల నష్టంతో 71,947.55 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 488.20 పాయింట్ల నష్టంతో 22,331.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.94గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,532 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

- ఇరాన్‌పై డొనాల్డ్ ట్రంప్ సర్కారు భూతల దాడులకు సిద్ధమవుతోందన్న వార్తలు వేళ.. తాము కూడా వారి రాకకోసం ఎదురు చూస్తున్నాయని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ పేర్కొన్నారు. అమెరికా దళాలు అడుగుపెట్టగానే వారిని బూడిద చేస్తామంటూ హెచ్చరించారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత తీవ్రం కావొచ్చున్న భయాలు నెలకొన్నాయి.
- యుద్ధం కారణంగా ఇప్పటికే అంతర్జాతీయంగా ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇప్పుడు ఇరాన్‌కు మద్దతుగా హూతీ రెబెల్ గ్రూప్ రంగంలోకి దిగింది. అది ఎర్ర సముద్రంలో మళ్లీ నౌకలపై ఈ గ్రూపు దాడి చేస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ మూడు శాతం పెరిగి, ఒక బ్యారెల్‌కు 115.9 చేరింది.
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు కూడా మన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీనికితోడు ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుం డడంతో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. శుక్రవారం కూడా రూ.4367 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించడం గమనార్హం.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com